అల్పపీడన ప్రభావం.. అందరికీ హెచ్చరిక

- డివిజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- మరో రెండు రోజులు అలర్ట్ చేసిన అధికారులు


మాట్లాడుతున్న ఆర్‌డీఓ రాణిసుస్మిత

రాయదుర్గం: రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఆకాశం మబ్బులతో కమ్మేసింది. శుక్రవారం పలు ప్రాంతాల్లో చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసింది. రోజంతా నీలిమబ్బులు కమ్ముకున్నాయి. రానున్న రెండు రోజులు పలు ప్రాంతాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. ఇంకా పంటల సాగు ముందుకు సాగలేదు. ప్రస్తుతం కురుస్తున్న చిరు జల్లులు రైతన్నకు కాస్త ఊరటనిస్తున్నాయి. వేరుశనగ విత్తనాలను ఇప్పటికే కొందరు అమ్ముకోగా, దాచుకున్న వారు సాగుకు సిద్ధమయ్యారు. ఇంకొందరు ప్రత్యామ్నాయ సాగువైపు దృష్టి సారిస్తున్నారు. సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కావడంతో జలాశయాల్లోకి ఆశించిన స్థాయిలో వరద నీరు చేరలేదు. కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు టీబీ డ్యాం, బీటీప్రాజెక్ట్ లకు మాత్రమే వరదనీరు వచ్చి చేరుతోంది. శుక్రవారం టీబీ డ్యాంకు అత్యధికంగా 10,890 క్యూసెక్కులతో ఇన్‌ఫ్లో కొనసాగింది. జలాశయం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ఇప్పటికే 55.972 టీఎంసీలకు నీరు చేరింది. 62,776 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో కొనసాగుతుంది.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి ..

వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణీసుస్మిత హెచ్చరించారు. అల్పపీడన ప్రభావంతో రానున్న రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో ఆర్డీఓ కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌తో పాటు ప్రతి మండలంలోనూ కాల్ సెంటర్‌ను ప్రారంభించాం. వర్షపాత నమోదుపై ఎప్పటికప్పుడు డీవైఎస్ఓ నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు. శుక్రవారం కంబదూరు 2.2 ఎంఎం వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా పరిశీలిస్తే గరిష్టంగా కణేకల్లులో 3 ఎంఎం వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలైన కణేకల్లు, డీ హీరేహాళ్, రాయదుర్గం ఈ మూడు నియోజకవర్గాల్లోనూ నీటమునిగే ప్రాంతాలను గుర్తించామన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కళ్యాణదుర్గం రూరల్: భారీ వర్షాల నేపథ్యంలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆర్డీఓ రాణీసుస్మిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో భారీ వర్షాలు - విపత్తు నిర్వహణపై వివిధ శాఖల, మండల అధికారులు, తహసీల్దార్‌లు, మున్సిపల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ రానున్న రోజుల్లో డివిజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ఆయా శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి, అందరూ ఉద్యోగుల అందుబాటులో ఉండే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను, పాఠశాలలను గుర్తించి, ఆ ప్రదేశంలో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని పోలీసు, అగ్నిమాపక అధికారులకు ఆదేశించారు.

క్లుప్తంగా

జోరుగా పారిశుధ్య పనులు


పారిశుధ్య పనులు చేయిస్తున్న పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర

కంబదూరు: కంబదూరు మండల కేంద్రంలో వర్షా కాలం సీజనల్ వ్యాధులు వ్యాప్తించే అవకాశం ఉండడంతో ముందు జాగ్రత్తగా సర్పంచ్ పద్మావతమ్మ ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేయించారు. శుక్రవారం స్థానిక పాత బస్టాండ్ ప్రాంతంలో పారిశుధ్య కార్మికులు మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడంతో పాటు ఇళ్ల సమీపంలో ఉన్న పేడ దిబ్బలు, చెత్తాచెదారం తొలగించారు. రక్షిత మంచి నీటి ట్యాంకులను శుభ్రం చేసి క్లోరినేషన్ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర తెలిపారు.

రిటైర్డ్ హెచ్‌ఎం లక్ష్మన్న మృతి


లక్ష్మన్న (ఫైల్)

కుందుర్పి: మండల కేంద్రంలో నివాసం ఉండే విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, సీపీఐ నేత, ఎస్టీయూ రాష్ట్ర నాయకుడు లక్ష్మన్న (93) శుక్రవారం మృతి చెందారు. గత కొన్ని రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తన స్వగృహంలోనే మృతిచెందారు. లక్ష్మన్నకు భార్య, ఒక కుమారుడు, నలుగురు కుమార్తెలు ఉన్నారు. లక్ష్మన్న మృతి పట్ల ఉపాధ్యాయ సంఘాల నాయకులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు, గ్రామ ప్రజలు సంతాపం ప్రకటించారు. శనివారం కుందుర్పిలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

అనారోగ్యంతో అగ్రికల్చర్ అసిస్టెంట్ మృతి


రమ్యకృష్ణ (ఫైల్)

బ్రహ్మసముద్రం : మండల పరిధిలోని అన్నేపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని ఆర్బీకేలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న రమ్యకృష్ణ (34) అనారోగ్యంతో గురువారం సాయంత్రం మృతి చెందారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు, అర్బీకే సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు తదితరులు మృతురాలి స్వగ్రామానికి వెళ్లి మృత దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దుర్వ్యసనాలకు దూరంగా ఉండాలి


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: మత్తు పదార్థాలు, చెడు అలవాట్లు, వ్యసనాలకు విద్యార్థులు దూరంగా ఉండి ఉత్తమ భవిష్యత్తు కోసం కృషి చేయాలని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ప్రిన్సిపాల్ వీరేష్ అధ్యక్షతన విద్యార్థులతో నిర్వహించిన అవగాహన సదస్సుకు డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి మన ఆలోచన విధానంలో మన భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే దిశగా ఉత్తమ పౌరులుగా ఎదగాలంటే క్రమ శిక్షణతో చదువుకోవాలన్నారు. దేశాన్ని, కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు.

టెంకాయల వేలం వాయిదా


నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయంలో వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: మండలంలోని నేమకల్లు గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో టెంకాయల విక్రయ హక్కుల కోసం వేలం దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి సమక్షంలో శుక్రవారం నిర్వహించారు. గ్రామస్తులు , ఆలయ సమస్యలపై అధికారులను నిలదీశారు. ఆలయం నుంచి వచ్చే ఆదాయ సొమ్మును తీసుకెళ్లడమే కానీ ఇక్కడ సమస్యలేమీ పట్టవా? అని అధికారులను ప్రశ్నించారు. దీంతో అధికారులు మధ్యనే హైడ్రామా నెలకొంది. వాదనల మధ్యనే టెంకాయల వేలం పాట నిర్వహించారు. గతేడాది రూ.6.20 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.4.80 లక్షలు మాత్రమే పలికింది. ఆదాయం తగ్గడంతో అధికారులు వేలం పాట వాయిదా వేశారు.

8 గదులు రూ.20 వేలు :

నేమకల్లు ఆంజనేయస్వామి ఆలయం ఎదురుగా ఉన్న 10 గదుల్లో 8 గదులకు వేలం పాట నిర్వహించారు. ఇందులో 2 వాయిదా పడినట్లు దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రాణి, ఈఓ నరసింహారెడ్డి తెలిపారు. 8 గదులకు రూ.20 వేలు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి


మహేష్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం : మండలంలోని గుడిపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త మహేష్ (37) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందాడు. ఎంపీపీ కంభం చంద్రశేఖర్‌రెడ్డి , వైస్ ఎంపీపీ సునందమ్మ , వైఎస్సార్ సీపీ నాయకులు బాధ పల్లప్ప, వడ్డే వెంకటేశులు తదితరులు గుడిపల్లికి వెళ్లి మహేష్ మృతదేహానికి నివాళులర్పించారు.

పెట్టుబడి సాయాన్ని మంజూరు చేయాలి


చిన్నముష్టూరులో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే అందించి ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రంగారెడ్డి, ఉపాధ్యక్షుడు మధుసూదన్, నాయకులు జ్ఞానమూర్తి, మురళి, వీరాంజనేయులు, రవికుమార్, ఇంద్రావతి ఓబుళేసు తదితరులు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల పరిధిలోని రాయంపల్లి, మోపిడి, చిన్నముష్టూరు తదితర గ్రామ సచివాలయ పరిధిలో ఆయా సచివాలయాల కార్యదర్శులకు రైతు సంఘం నాయకులు వినతి పత్రం అందించారు. జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు రంగారెడ్డి, మధు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూ.20 వేల పెట్టుబడి సాయంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2023 ఖరీఫ్, రబీ సీజన్‌లో నష్టపోయిన పంటలకు బీమా ప్రకటించాలన్నారు. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు.

కౌలు రైతులందరికీ సాగు పత్రాలివ్వాలి

కూడేరు: అర్హులైన కౌలు రైతులందరికీ సాగు పత్రాలు అందజేయడంతో పాటు రైతు భరోసా, ఇతర పథకాల లబ్ధి చేకూర్చాలని ప్రభుత్వాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన కూడేరులో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం రైతులకు ఇస్తానన్న పంట పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లోకి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు 200 రోజుల పని కల్పించాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కూడేరులోని సచివాలయం-1, 2లో వెల్ఫేర్ అసిస్టెంట్లు షరీఫ్, సత్యనారాయణకు అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల నాయకులు ఈరప్ప, వెంకటేశులు పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి


సీఐ శివరాముడుతో మాట్లాడుతున్న దళిత నేతలు

కూడేరు: జల్లిపల్లికి చెందిన దళిత మహిళ లక్ష్మీదేవి కుటుంబానికి రక్షణ కల్పించాలని పోలీసులను దళిత సంఘం నేతలు కోరారు. బాధితురాలితో కలసి శుక్రవారం సీఐ శివరాముడుకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన అగ్రవర్ణాలవారు లక్ష్మీదేవి కుటుంబాన్ని వేధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. గతంలో పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదన్నారు. ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు ఎల్లన్న, ఎమ్మార్పీఎస్ నాయకులు రాజు, లక్ష్మన్న , దివ్యాంగుల సంఘం నాయకులు వసంత, రాజేష్, ఎస్సీ స్టేటస్ ఫోరమ్ నాయకులు రామాంజనేయులు, ముత్యాలు తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


ఆముదం పంటను పరిశీలిస్తున్న ఏఓ విజయ కుమార్

కూడేరు: పి.నారాయణపురంలో వర్షాభావంతో దెబ్బతిన్న ఆముదం, కంది, వేరుశనగ పంటలను శుక్రవారం మండల వ్యవసాయాధికారి విజయకుమార్ పరిశీలించారు. జూన్ మాసంలో కంది, ఆముదం, వేరుశనగ విత్తిన తర్వాత ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో పంటలు ఎదుగుదల లేక దెబ్బతిన్నాయి. ఏఓ పంటలను పరిశీలించారు. వర్షాభావంతో కంది, వేరుశనగ పంటలు మరింత దెబ్బతినకుండా ఉండేందుకు లీటర్ నీటిలో 19:19:19ను 10 గ్రాములు లేదా పోటాషియంనైట్రేట్‌ను 5 గ్రాములు చొప్పున కలిపి మొక్కలు బాగా తడిచేలా పిచికారీ చేయాలన్నారు.

కుంటల్లో గంబూసియా చేపలు విడుదల


ఉరవకొండలో మంచినీటి కుంటలో గంబూసియా చేపలను వదులుతున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలో డెంగీ, మలేరియా, చికున్ గన్యా, మెదడువాపు వ్యాధికి కారణమయ్యే కీటక జనిత వ్యాధులను నియంత్రించేందుకు ఎంపీడీఓ సుబ్బరాజు, ఈఓ గౌస్‌సాహెబ్, మలేరియా సబ్‌డివిజన్ అధికారి భక్తులకోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో మంచినీటి కుంటల్లో గంబూసియా చేపలను శుక్రవారం వదిలారు. ఈసందర్భంగా ఎంపీడీఓ సుబ్బరాజు మాట్లాడుతూ అనంతపురం ఫిషరీస్ డిపార్టమెంట్ నుంచి ప్రత్యేకంగా 20 వేల గంబూసియా చేప పిల్లలను మండలంలోని మంచి నీటి కుంటల్లో వదిలినట్లు తెలిపారు. సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కలుషిత నీటిని తాగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఉరవకొండలో డెంగీ మాసోత్సవ ర్యాలీని ఆశా, అంగన్‌వాడీ, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించారు.

23 నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు

కణేకల్లు: మండలంలోని ఈనెల 23 నుంచి 27 వరకు గ్రామ సచివాలయాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గూడెన్న తెలిపారు. 0 నుంచి ఐదేళ్ల ఏళ్ల చిన్నారులకు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ చేయనున్నట్లు తెలిపారు. 23న పులచెర్ల-2 గ్రామ సచివాలయం, కణేకల్లు-2 గ్రామ సచివాలయం, గరుడచేడు, 24న జక్కలవడికి, 43 ఉడేగోళం, సొల్లాపురం, 25న యర్రగుంట-1, కోకుర్తి, ఎన్.హనుమాపురం 26న బెణికల్లు, మాల్యం, తుంబిగనూరులో, 27న గెనిగెర, రచ్చుమర్రి, పెనకలపాడులో ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

21న గురుపౌర్ణమి వేడుకలు

కూడేరు: ఈ నెల 21న కూడేరులోని షిర్డీ సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ ట్రస్టు సభ్యులు శుక్రవారం తెలిపారు. శనివారం (20న) సాయంత్రం కూడేరు పురవీధుల్లో షిర్డి సాయిబాబా ఉత్సవ మూర్తి ఊరేగింపు ఉంటుంది. 21న ఉదయం 6 గంటలకు సాయినాథునికి సామూహిక అభిషేకం, 9 గంటలకు నవగ్రహ, మృత్యుంజయ, దత్తాత్రేయ హోమాలు ఉంటాయి. అనంతరం అన్నదానం ఉంటుంది. వేడుకల్లో భాగంగా కూడేరు, అంతరగంగ, ఇప్పేరు, అరవకూరు, కమ్మూరు, ముద్దలాపురంతో పాటు మరికొన్ని గ్రామాల్లో శుక్రవారం భిక్షాటన చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రకరూరు: సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం మండలకేంద్రం వజ్రకరూరులో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ చేశారు. స్థానిక ప్రభుత్వాస్పత్రి నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా బస్టాండ్ వరకు ర్యాలీ చేశారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల బారిన పడకుండా పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలన్నారు. ఇళ్లలో డ్రైడే ఫ్రైడే పాటించాలన్నారు. అనంతరం మండలంలోని పీసీప్యాపిలి గ్రామంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహించారు. హెల్త్‌ఎడ్యుకేటర్ సత్యనారాయణ, మలేరియా సబ్‌యూనిట్ అధికారి కొ దండరామిరెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్,ఎల్‌టిలలిత, హెల్త్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు


గాయపడిన రవి

శెట్టూరు: మండలంలోని అడవిగొల్లపల్లి ఫారెస్ట్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూజారి రవి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. రవి కళ్యాణదుర్గం విద్యుత్ శాఖలో పనిచేస్తున్నారు. శుక్రవారం శెట్టూరుకు మొహర్రం వేడుకలకు వచ్చి తిరిగి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా, అడవిగొల్లపల్లి ఫారెస్ట్‌లోని ప్రధాన మలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనింది. ఈ ప్రమాదంలో రవి తలకు తీవ్ర గాయాలయ్యాయి. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

వజ్రకరూరు: విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉన్నత లక్ష్యాన్ని చేరుకోగలరని వైద్యాధికారి తేజశ్వి తెలిపారు. శుక్రవారం మండలంలోని కమలపాడు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి తేజశ్వి మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ కనబరచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి తేజశ్వి,హెచ్‌ఎం వేణుగోపా ల్, 108 సిబ్బంది రాము, నటరాజ్‌గౌడ్, ఏఎన్‌ఎం ఉషా మౌనిక, ఎంఎల్‌హెచ్‌పీలు సుధామాధురి, లక్ష్మీకాంతమ్మ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించండి

బొమ్మనహాళ్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పీహెచ్‌సీ వైద్యాధికారిణీ శ్రీలక్ష్మీ కోరారు. శుక్రవారం స్థానిక పీహెచ్‌సీలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో చెట్లు ఎంతో కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి బాధ్యతను తీసుకున్నప్పుడే మొక్కలకు రక్షణ ఉంటుందన్నారు.

కర్రిబసప్ప మృతి తీరని లోటు

బొమ్మనహాళ్: మండలంలోని శింగానహాళ్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కర్రిబసప్ప (46) అనారోగ్యంతో మృతిచెందాడు. ఐదు రోజులుగా బెంగళూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన భౌతికకాయాన్ని మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సందర్శించి, నివాళులర్పించారు. కరిబసప్ప కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కర్రిబసప్ప మృతి వైఎస్సార్‌సీపీ పార్టీకి తీరని లోటని, ఆయన కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

ముగిసిన మొహర్రం ఉత్సవాలు


గలగల గ్రామంలో పీర్లను ఊరేగిస్తున్న భక్తులు


లక్ష్మంపల్లిలో జలధికి సిద్ధమైన పీర్లస్వాములు


బోరంపల్లిలో ఊరేగింపుగా వెళ్తున్న పీర్లు

గుమ్మఘట్ట: మండలంలోని గలగల, కలుగోడు, గుమ్మఘట్ట,75 వీరాపురం, పూలకుంట, గోనబావి లో మొహర్రం వేడుకలు శుక్రవారంతో ముగిశాయి.

కళ్యాణదుర్గం రూరల్: హిందూ ముస్లింలు ఐక్యంగా నిర్వహించుకునే మొహర్రం పండుగ ముగిసింది. మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో మొహర్రం వేడుకలు ముగిశాయి. గ్రామంలోని ప్రజలు ఉత్సాహంతో మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా పీర్ల దేవుళ్లను గ్రామంలో ఊరేగించారు.

కణేకల్లు: మండలంలోని గెనిగెరలో పెద్ద సరిగెత్తు వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. భక్తులు చెక్కర ఫాతేహాలు, చెక్కరతో తులాభారం చేయించారు. పెద్ద సరిగెత్తు వేడుకలు నిర్వహించారు. జెడ్పీ మాజీ సభ్యులు పాటిల్ నాగిరెడ్డి పీర్లను దర్శించుకొని ఫాతేహాలు చేయించారు.

కుందుర్పి: మండలంలోని ఎనుముల దొడ్డి, తెనగల్లు, అపిలేపల్లి, కలిగొలిమిలో మొహర్రం వేడుకలు శుక్రవారం నిర్వహించారు. హిందూ-ముస్లింలు ఐక్యంగా మొహర్రం వేడుకలు నిర్వహించారు. ఎక్కడ చూసినా సందడి, కోలాహలం నెలకొంది. అనంతరం జలధికి తరలించారు.

శెట్టూరు: శెట్టూరు, లక్ష్మంపల్లి, కనుకూరు, బచ్చేహళ్లి తదితర గ్రామాల్లో పీర్లస్వాములు జలధికి తీసుకెళ్లారు. చివరి రోజు భక్తి శ్రద్ధలతో జలధి నిర్వహించారు. మొహర్రం ప్రశాంతంగా ముగిసినట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

కూడేరు: మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి, అరవకూరు, చోళసముద్రం గ్రామాల్లో శుక్రవారం పీర్లు జలధికి వెళ్లాయి. పీర్లు అగ్నిగుండ ప్రవేశం చేశాయి. సాయంత్రం పీర్లను మంగళవాయిద్యాల నడుమ గ్రామ వీధుల్లో ఊరేగించారు. ఎలాంటి గొడవలు జరగకుండా సీఐ శివరాముడు సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు.


బ్రాహ్మణపల్లిలో జలధికి వెళ్తున్న పీర్లు


ఎనుముల దొడ్డిలో పీర్లను ఊరేగిస్తున్న దృశ్యం


పీర్లదేవుళ్లకు ప్రత్యేక ఫాతెహాలు చేయిస్తున్న దృశ్యం